
సాక్షి గుంటూరు

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 6034 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 35,019 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 36,760 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది.

శతాధిక వృద్ధురాలి మృతి



చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలకు చెందిన శతాధిక వృద్ధురాలు కార్యంపూడి లక్ష్మీకాంతమ్మ (104) సోమవారం ఉదయం మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

న్యూస్‌రీల్

ముగిసిన నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలతో నిర్వహించిన ఉత్సవాలకు సోమవారం అర్చకులు పవిత్రాలు సమర్పించారు. గాలి గోపురంపై వాటిని ఉంచి ఉత్సవాలు నిర్వహించారు. పూర్ణాహుతి , శ్వేత పుష్ప గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. ఏర్పాట్లను ఈవో ఏ. రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

వినాయకుడికి 134 రకాల ప్రసాదాలు



తాడేపల్లి రూరల్ : ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి సోమవారం 134 రకాల ప్రసాదాలను కమిటీ సభ్యులు తయారు చేసి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాధారణంగా గణేష్ ఉత్సవాలు తొమ్మిది రోజులు నిర్వహిస్తారని, తాము 15 రోజులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

నేడు ఏఐజీ హాస్పిటల్స్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఏఎన్‌యూ: హైదరాబాద్ ఏఐజీ (ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ) మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఏఐజీలో ఔట్ పేషెంట్ కోఆర్డినేటర్, ఇన్ పేషెంట్ కోఆర్డినేటర్ ఉద్యోగాల భర్తీ కోసం ప్లేస్‌మెంట్స్ చేపడుతోంది.ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 30 సంవత్సరాలలోపు వయస్సున్న వారు అర్హులు. మొత్తం 100 ఉద్యోగాలను ఏఐజీ సంస్థ భర్తీ చేయనుంది. యూనివర్సిటీలోని ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉదయం 10 గంటలకు క్యాంపస్ డ్రైవ్ ప్రారంభమవుతుంది.

అంధకారంలో ఆర్టీసీ బస్టాండ్

- గంటన్నరకు పైగా నిలిచిపోయిన విద్యుత్
- సబ్ స్టేషన్‌లో ఫ్యూజ్ పోవడమే కారణం



పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సోమవారం రాత్రి అంధకారంలో ఉండిపోయింది. సుమారు గంటన్నరకు పైగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్‌కు నందివెలుగు రోడ్డులోని సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. సోమవారం సబ్ స్టేషన్‌లో ఫ్యూజ్ పోవడంతో రాత్రి ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు చీకటి నెలకొంది. పలుమార్లు విద్యుత్ వస్తూ పోతుండటంతో జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. ఆర్టీసీ ఎలక్ట్రికల్ సిబ్బంది సబ్ స్టేషన్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

రైతు గుండెల్లో జలదరింపు

- తాడికొండ, నీరుకొండను వదలని వరద ముప్పు
- కొండవీటి వాగుకు వరద తగ్గినా పొలాల్లో కదలని నీరు
- రైతులకు తప్పని అవస్థలు
- పంట నష్టం అంచనాలలో వ్యవసాయాధికారుల అలసత్వం
- పరిహారంపై రైతుల్లో అయోమయం



తాడికొండ- నీరుకొండ మధ్య పంట పొలాల్లో కదలని వరద నీరు

తాడికొండ: కొండవీటి వాగుకు వరద ముప్పు తప్పి వారం రోజులైనా రైతులు ఆందోళనలోనే ఉన్నారు. నీటి పారుదల వ్యవస్థ సరిగా లేకపోవడంతో పల్లపు ప్రాంతాల్లోని వేలాది ఎకరాల్లో నీరు ఇంకా నిలిచే ఉంది. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. తాడికొండ- నీరుకొండ మధ్య ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి. మట్టి నాని బురద మేట వేసింది. ఈ నేపథ్యంలో రబీ పంట సాగు కష్టమేనని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గండ్లతో కడగండ్లు

భారీ వర్షాలకు వాగులకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. ఇరిగేషన్ అధికారులు వరద తగిన వెంటనే పూడ్చివేసి నీటిని బయటకు తోడటం లేదా మళ్లించే చర్యలు చేపట్టాలి. వరద తగ్గి వారం రోజులైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికే తాడికొండలో పెద్ద వాగుకు పలుచోట్ల కట్టలు తెగాయి. నీరు పంట పొలాలపై విరుచుకుపడింది. రైతులే స్వచ్ఛందంగా తూటుకాడ తొలగింపు, దొంకలపై గండ్లు పూడ్చివేసే పనులు చేసుకుంటున్నారు. నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సమీపంలో ఇంకా వేలాది ఎకరాలు నీటి ముంపులోనే ఉన్నాయి. వాస్తవానికి కాస్త భారీ వర్షం కురియగానే పెదపరిమి- నీరుకొండ, యర్రబాలెం, కృష్ణాయపాలెం రోడ్లపై వరద నీరు వారం రోజుల పాటు నిలిచి ఉంటోంది. దీనివల్ల ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి రాకపోకలు నిలిచిపోతున్నాయి. విద్యార్థులతో పాటు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రకటనలే తప్పా పట్టించుకున్న దాఖలాలు లేవు. రైతులకు ఏటా రూ. కోట్లలో నష్టం జరుగుతోంది. ఈ ఏడాది కూడా భారీ వర్షాల దెబ్బకు పొలాలు పూర్తిగా నీట మునిగాయి. అధికారులు వెంటనే స్పందించి గండ్లు పూడ్చడంతో పాటు పొలాల్లోని వరద నీటిని బయటకు మళ్లించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వేలాది ఎకరాల్లో నష్టం

కొండవీటి వాగు ముంపు దెబ్బకు తాడికొండ మండలంలో పత్తి, మినుము, వరి, ఇతర పంటలు వేలాది ఎకరాల్లో దెబ్బతిన్నాయి. అయితే, అధికారులు ఇప్పటి వరకు కేవలం వందల సంఖ్యలోనే నష్టం అంచనాలను రూపొందించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో సమాచారం అందించి అర్హులందరికీ పంటనష్టం పరిహారం నమోదు చేసి, న్యాయం చేయాలని కోరుతున్నారు.

రెండు రోజుల్లో అర్హుల జాబితా

రాష్ట్రమంతా ఎన్యూమరేషన్ జరుగుతోంది. ఈ విషయం రైతులకు తెలుసు. రెండు రోజుల్లో అర్హుల జాబితా సమాచార బోర్డులో ప్రదర్శిస్తాం. పేర్లు లేని వారు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదిస్తే నమోదు చేస్తారు.

– నరసింహారావు, వ్యవసాయాధికారి



నీరుకొండ వద్ద ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సమీపంలోని పంట పొలాల్లో బురద నీరు

పంట నష్టం అంచనాలో కాకి లెక్కలు

తాడికొండ మండలంలో పంట నష్టం అంచనాల రూపకల్పన అంతా కాకి లెక్కలు చందంగా ఉంది. వ్యవసాయాధికారులు పూర్తిగా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఎక్కడో మూలన కూర్చుని లెక్కలు వేస్తున్నారు. అధికారుల పర్యటన, ఎన్యూమరేషన్ ఎక్కడ చేస్తోంది కూడా రైతులకు తెలియడం లేదు. వాస్తవానికి ఇప్పటి వరకూ ప్రాథమిక అంచనాలకే పరిమితమయ్యారు. క్షేత్రస్థాయిలో పర్యటన, ముంపు బాధిత రైతులకు పరిహారంపై సమాచారం లేదు.

ప్రభుత్వం పునరాలోచించాలి



వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం, సీట్లను తిరస్కరించడం మా లాంటి విద్యార్థులకు నిరాశే. ఎంతో కష్టపడి నీట్ పరీక్షలు రాసి మంచి ర్యాంకులు సాధించినప్పటికీ సీటు వస్తుందో, రాదో తెలియక ఆందోళన చెందుతున్నాం. కేటగిరీల వారీ కాకుండా అన్ని సీట్లు ఫ్రీగా కేటాయించి, నీట్‌లో ర్యాంకులు సాధించిన వారందరికీ సీట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలి.

– మామిడిబత్తుల స్వామి అయ్యప్ప, నీట్ విద్యార్థి, మచిలీపట్నం



ప్రైవేటు పరం చేయడం అన్యాయం



ప్రభుత్వ వైఖరి మారాలి. వైద్య విద్య పేద విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కృషి చేశారు. అయితే ఇప్పుడు వాటిని ప్రైవేటు పరం చేయడం చాలా అన్యాయం. మంజూరైన సీట్లు వదిలేశారు. పేద విద్యార్థులు వైద్య విద్య ఎలా చదవగలుగుతారు..? ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలి.

– సమీర్ అహ్మద్, విద్యార్థి, కానూరు

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి



బోల్తా పడిన వాహనాన్ని లేపుతున్న భక్తులు

- నారాకోడూరు సమీపంలో దుర్ఘటన
- ఒకరి మృతి.. 15 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- నిమజ్జనానికి వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మరో వాహనం

చేబ్రోలు: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుంది. రెండు వాహనాలు ఢీకొని ఒకరి మృతి చెందగా, 15మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు సంపత్‌నగర్, ఐపీడీ కాలనీలకు చెందిన భక్తులు రెండు భారీ వినాయక విగ్రహాలను నిమజ్జనానికి ట్రాక్టర్, మినీ వ్యాన్‌లో విడివిడిగా చేబ్రోలు మండలం సంగం జాగర్లమూడి వద్ద కొమ్మమూరు చానల్‌కు తెచ్చారు. మార్గంమధ్యలో మండల పరిధిలోని నారాకోడూరు కామధేను ఫీడ్స్ సమీపంలోని మినరల్ వాటర్ ప్లాంట్ ఎదురుగా అప్పటికే నిమజ్జనం నుంచి తిరిగి వస్తున్న మినీ వ్యాన్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ రెండు వాహనాల్లో సుమారు 50మంది వరకు నిమజ్జనానికి వచ్చిన భక్తులు ఉన్నారు. ఈ సంఘటనలో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ప్రమాద సమయంలో భక్తులు హాహాకారాలు మిన్నంటాయి.



తీవ్రంగా గాయపడిన వినయ్‌కుమార్

నిమజ్జనానికి వచ్చి అనంత లోకాలకు..

ఈ ప్రమాదంలో గుంటూరు నల్ల చెరువుకు చెందిన వేముల శివశంకర్ (26) ప్రాణాలు కోల్పోయాడు. తొలుత తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంలో రెండు వాహనాల్లోని 15మందికి గాయాలయ్యాయి. ఐపీడీ కాలనీకి చెందిన తేజకణతకు, ముఖానికి, కాళ్లు చేతులకు, సంపత్ నగర్‌కు చెందిన వినయ్, కృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను మూడు అంబులెన్స్‌లలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు, వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

ఒక్క మాత్రతో నులిమేద్దాం !

చిన్నారుల జీవితాన్ని నులి పురుగులు నులిమేస్తున్నాయి. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పిల్లలో అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులి పురుగులను ఒకే మాత్ర అల్బెండజోల్‌తో నివారించవచ్చు. 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నేపథ్యంలో ప్రభుత్వం 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచితంగా మాత్రల్ని ఆయా పాఠశాలల ద్వారా పంపిణీ చేసింది.ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- నేడు జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం
- జిల్లావ్యాప్తంగా ఉచితంగా మాత్రల పంపిణీ

గుంటూరు మెడికల్: నులి పురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారి తీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారతాయి. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలిగిస్తాయి. దీనివల్ల ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపాల్ని కలిగి ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

అపరిశుభ్రతే కారణం

అపరిశుభ్రత వల్లే నులి పురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లల్లో సమస్య ఎక్కువగా ఉంటుంది. ఎప్పుడూ చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. పెరిగితే వెంటనే కత్తిరించుకోవాలి. లేనిపక్షంలో వాటిల్లో పేరుకున్న మట్టి ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వల్ల కూడా మన శరీరంలోకి చేరతాయి. కూరగాయలను కడగకపోవడం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవడం వల్ల కూడా నులి పురుగులు వ్యాపించే అవకాశం ఉంది.

మాత్రల దోస్ ఇలా...

ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర(200 మిల్లీగ్రాములు) నీళ్లలో కలిపి పట్టించాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 400 మిల్లీ గ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. మాత్రను మింగకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. పాఠశాలల్లో విద్యార్థులంతా టీచర్లు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు నమిలి మింగించేలా చూడాలి.



డీవార్మింగ్ పోస్టర్

మాత్రలతో పురుగులకు అడ్డుకట్ట



పిల్లలో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలికపాములు, నులి పురుగులు, కొంకి పురుగులు. వీటిని నిర్మూలించేందుకు అల్బెండజోల్ మాత్రను భోజనం తరువాత తీసుకోవాలి. వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులి పురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి. మాత్రలను దీర్ఘకాలిక రోగులు, ఇతర మందులు వాడుతున్న వారు కూడా తీసుకోవచ్చు.

– డాక్టర్ తిమ్మాపురం చంద్రశేఖర్‌రెడ్డి, పిల్లల వైద్యనిపుణులు, గుంటూరు.

శుభ్రత పాటించాలి



బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి. గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. పండ్లు, కాయగూరలు శుభ్రంగా కడిగిన తర్వాతే వినియోగించాలి.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ, గుంటూరు

జిల్లావ్యాప్తంగా పంపిణీ



జిల్లాలో 159 కాలేజీలు, 1,480 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,675 పాఠశాలల్లో 5,15,820 మంది 19 ఏళ్లలోపు పిల్లలు ఉన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశాం. 17న జాతీయ నులిపురుగుల కార్యక్రమం నాడు మాత్రలను మింగని వారికి ఈనెల 25న స్పెషల్ డ్రైవ్ చేపట్టి మింగేలా చూస్తాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డైక్ సెంటర్ జిల్లా ఇన్‌చార్జి గుంటూరు



భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుంటూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

– గుంటూరు

రూ. 7 లక్షలు పలికిన గణేష్ లడ్డూ

- ఉండవల్లిలో వైభవంగా గణేష్ నిమజ్జనం
- స్వామివారి ఆదాయం రూ.11.50 లక్షలు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ ఉండవల్లి రెడ్ల రామ మందిరం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్వామి వారికి భక్తులు ఇచ్చిన లడ్డూ, మణిహారాలకు వేలం పాట నిర్వహించారు. మొత్తం స్వామివారికి రూ.11.50 లక్షల ఆదాయం లభించింది. స్వామి వారికి గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరయాదవ్ 116 కిలోల లడ్డూ ఇవ్వగా, ఇదే గ్రామానికి చెందిన శ్రీసాయి కృష్ణ స్వీట్స్ అధినేత నల్లగొర్ల గంగాధర్‌రావు కుమారులు శ్రీనివాసరావు యాదవ్, బాలాజీ యాదవ్, తిరుమలరావు యాదవ్‌లు రూ. 7 లక్షలకు పాటలో దక్కించుకున్నారు. మరో ఐదు కిలోల లడ్డూను గ్రామానికి చెందిన మున్నంగి శ్రీధర్‌రెడ్డి రూ. 35 వేలకు దక్కించుకున్నారు. పి.నాగిరెడ్డి ఇచ్చిన రూ. 50 వేల నగదు మణిహారాన్ని మున్నంగి సాంబిరెడ్డి (ఎంఎస్ఆర్) వేలంపాటలో చేజిక్కించుకున్నారు. మరో రూ. 50 వేల విలువైన మణిహారాన్ని ఇటీవల మృతి చెందిన పార్థసారథిరెడ్డి, దివ్య సాయినాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. రూ.35 వేల మణిహారాన్ని దంటు గోవర్ధన్‌రెడ్డి పాటలో రూ. 55 వేలకు దక్కించుకున్నారు. మరో మణిహారాన్ని గ్రామానికి చెందిన ప్రసాద్ యాదవ్ తదితరులు పాడుకున్నారు.



తిరుమలరావుయాదవ్‌కు లడ్డూ అందిస్తున్న కమిటీ సభ్యులు (శాలువా కప్పుకున్న వ్యక్తి)

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **4,500** గరిష్టం : రూ. **6,800**

మోడల్ ధర రూ. **5,700**

క్లుప్తంగా

భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు !



పెదకాకాని: దేవాలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలిగించవద్దని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని సోమవారం ఆయన సందర్శించారు. డీసీ దాసర శ్రీరామవరప్రసాదరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయన స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ డీసీ స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించి, దివ్య ప్రసాదం, చిత్రపటం అందజేశారు. అనంతరం కమిషనర్ ఆలయంలోని రాహుకేతు మండపం, అన్నప్రసాద శాల, పొంగలి శాల తదితర ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆలయంలో ఏర్పాట్లపై భక్తులతో మాట్లాడారు. పలువురు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయంలో ఏర్పాట్లు, వసతులు, నిర్వహణపై సిబ్బందికి కమిషనర్ పలు సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో నజీర్‌కు స్వర్ణం



బాపట్ల: ఆంధ్రప్రదేశ్ 11వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బాపట్లకు చెందిన షేక్ నజీర్‌కు బంగారు పతకం లభించింది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు అమలాపురంలో జరిగిన మాస్టర్స్ కేటగిరీలో 70కేజీల శరీర బరువు విభాగంలో ప్రథమస్థానం దక్కించుకున్నారు. వీటితోపాటు పలు క్రీడల్లో కూడా రాణించిన నజీర్‌కు బాపట్ల క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఆలస్యం అమృతం నరకం

- అమృత్ భారత్ స్టేషన్ పథకం నత్తనడక
- పరిశీలించిన తెనాలి రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు



తవ్వేసి ఉన్న ఒకటో నంబరు ప్లాట్‌ఫాం

తెనాలి: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో వందలాది రైల్వేస్టేషన్లను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో విజయవాడ-చెన్నై రైలు మార్గంలోని తెనాలి రైల్వే జంక్షన్ ఒకటి. పాక్షికంగా ఆధునికతను సంతరించుకున్న రైల్వేస్టేషన్‌కు మరింత ఆధునిక సౌకర్యాల కల్పనంటే సాధారణ ప్రయాణికులతోపాటు తెనాలి ప్రజలు సంతోషించారు. అమృత్ భారత్ పనులు నత్తతో పోటీ పడటం ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. దీనిపై రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఆయా పనుల్ని సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

పలు వసతుల కల్పనకు శ్రీకారం

దేశవ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజనులో తొలి దశలో 11 రైల్వేస్టేషన్లను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ప్రయాణికుల అవసరాలకు తగినట్టుగా స్టేషను సర్కులేటింగ్ ఏరియా విస్తరణ, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్ ఫాంలపై రూఫ్‌ల పొడిగింపు, ఫర్నిచరు, ఎస్కలేటర్లు, లిఫ్టుల వంటి వివిధ రకాల మౌలిక సదుపాయాల కల్పనను ఈ పథకంలో చేర్చారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్న భావనతో రైల్వేశాఖ ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించింది. వాటిని ప్రాధాన్యం ప్రకారం అమలు చేయనున్నట్టు ఉన్నతాధికారులు కూడా ప్రకటించారు.



పనులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

రూ.27.05 కోట్ల వ్యయం

గత ఫిబ్రవరిలో రైల్వేస్టేషనులో పనులు ఆరంభించారు. మొత్తం రూ.27.05 కోట్ల వ్యయంతో ఒకటో నంబరు ప్లాట్‌ఫాం, రూఫ్ పొడిగింపు, ఫ్లోరింగ్, ఏసీ వెయిటింగ్ హాలు, టాయ్‌లెట్లు, దక్షిణంవైపు నిర్మించిన ఫుట్‌బ్రిడ్జికి ఎస్కలేటరు, 2,3,4,5 ప్లాట్‌ఫాంలకు కనెక్షన్లు, లిఫ్టుల ఏర్పాటు వంటివి వీటిలో ఉన్నాయి. స్టేషను వెలుపల తూర్పు వైపు ఖాళీ అయిన క్వార్టర్ల స్థానంలో ఏసీ వెయిటింగ్ హాలు నిర్మాణం చేపడుతున్నారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై గల విద్యుత్ సబ్‌స్టేషను, జనరేటరును అలాగే ఉంచి, వీటి నిర్వహణకు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని స్టేషనుకు ఉత్తరం వైపున గల గూడ్స్ షెడ్ వద్ద నిర్మించనున్నారు. అన్ని పనులు ఇప్పుడు అసంపూర్తిగా ఉన్నాయి. నిర్మాణ పనుల్లో జాప్యం చోటుచేసుకోవటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.



స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటరమణతో కమిటీ సభ్యులు

కమిటీ సభ్యుల అసంతృప్తి

అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెనాలి రైల్వేస్టేషనును సందర్శించి, పనులను పరిశీలించారు. సూపరింటెండెంట్ వెంకటరమణను కలిసి తమ అభిప్రాయాలను వివరించారు. దక్షిణం వైపు గల ఫుట్ బ్రిడ్జిని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంతోనే సరిపెట్టకుండా, ప్రయాణికులు నేరుగా స్టేషను వెలుపలకు వచ్చేలా తూర్పు వైపు రోడ్డులోకి విస్తరించాలని చేసిన ప్రతిపాదన కార్యరూపంలోకి వచ్చేలా లేదని చెప్పారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం విస్తరణకే అంతా తవ్వేసి ఉందని, రూఫ్ పొడిగింపు పనులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ప్లాట్‌ఫాంపై నడిచేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, టైల్స్ మధ్య ఖాళీలో పడిపోతున్నారని చెప్పారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని కమిటీ సభ్యుడు అడపా సంపత్‌రాయుడు పేర్కొన్నారు. రూఫ్‌పై రేకులు వేయని కారణంగా పగటిపూట ఎండ తీవ్రతకు గురవుతున్నారని, రాత్రి పూట లైటింగ్ కూడా లేదని సభ్యులు తెలిపారు. స్టేషనులోంచి రైలు దిగిన ప్రయాణికులు నేరుగా బయటకు వచ్చేలా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని దక్షిణం వైపు పొడిగిస్తే బాగుంటుందని సూచించారు. ఉత్తరంవైపున నిర్మించటం సమంజసం కాదని, దీనిపై పునఃపరిశీలన చేయాలని కోరామని సంపత్‌రాయుడు చెప్పారు. ప్రతిరోజూ 180 రైళ్ల రాకపోకలు సాగించే తెనాలి రైల్వేస్టేషనులో కల్పించే వసతులు అందరికీ ఉపయోగపడేలా ఉండాలనేది తమ భావనగా వివరించారు. వీరితో కమిటీ సభ్యులు దారా సాయిగుప్తా, కుశల్‌రాజ్ జైన్, శిఖా రవీంద్ర, తిరువై వెంకటేశ్వరరావు ఉన్నారు.

ముగిసిన అమరావతి నృత్యోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నగరంపాలెం: రెండు రోజులుగా కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న ఎనిమిదో అమరావతి నృత్యోత్సవం-2024 (భారతీయ నాట్య రీతుల సమ్మేళనం) సోమవారంతో ముగిసింది. ప్రత్యేక అతిథిగా చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, నాట్యగురు ఎన్.బాలసుబ్రమణ్యాచారి, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, వూటుకూరి నాగేశ్వరరావు హాజరయ్యారు.. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు ఏపీ స్టేట్ నాటక అకాడమి వైస్‌చైర్మన్ డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. అనంతరం కె.సంధ్యారాణి (హైదరాబాద్) కూచిపూడి నృత్యం, ఎం.శ్రీవల్లీరావు (హైదరాబాద్) కథక్ నృత్యం, గరిణే సంతోష్ కుమార్, గరిణే సాయికుమార్ (సూర్యా పేట) పేరిణి నృత్యం, సి.శ్రీనర్తన (హైదరాబాద్) ఆంధ్ర నాట్యం అలరించాయి. హైదరాబాద్ కళాకారుల నాట్యంశాలు అబ్బురపరిచాయి. ఎనిమిదేళ్లుగా ఒకే వేదికపై నృత్య ప్రదర్శనలను ప్రదర్శిస్తున్న అకాడమీ నిర్వాహకులను అతిథులు అభినందించారు. కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కోకా విజయలక్ష్మి, సమన్వయకర్త జి.రవి, డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన స్టాఫ్ నర్సులు

- జీజీహెచ్‌లో 12వ రోజుకు చేరుకున్న నిరసన
- నల్ల బ్యాడ్జీలు ధరించి సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ప్రదర్శన



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిలబడి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. తమను రెగ్యులర్ చేసే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు. జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయా రు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే మంగళవారం నుంచి అత్యవసరం మినహా సాధారణ వైద్యసేవలన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

పీడియాట్రీషియన్‌గా సేవలందిస్తా !

- నీట్‌లో 720కి 551 మార్కులు సాధించిన రీతూ జన్నీ
- ప్రభుత్వ కళాశాలలో మెడికల్ సీటు



నెహ్రూనగర్: డాక్టర్ కావాలన్న కల ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఆ అదృష్టం కొంత మందికి మాత్రమే దక్కుతుంది. గుంటూరు నగరానికి చెందిన పేరికలపూడి రీతూ జన్నీ నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 551 సాధించి ప్రభుత్వ సీటు దక్కించుకుంది. తండ్రి రమేష్ గుంటూరు నగరపాలక సంస్థ స్కూలులో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. నీట్‌లో ర్యాంకు సాధించడంలో తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని రీతూ జెన్నీ చెప్పారు. ఈమని గ్రామ దళితవాడకు చెందిన ఆమె 10వ తరగతిలో 10/10 మార్కులు సాధించింది. ఇంటర్‌లో 1000/973 సాధించి అందరి మన్ననలు పొందింది. చిన్నప్పటి నుంచి డాక్టర్ అవ్వాలనే కోరికతో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంది. మొదటి ప్రయత్నంలోనే 720 మార్కులకు 551 మార్కులు సాధించింది. నేడు ప్రభుత్వ సీటు దక్కించుకోవడంపై పలువురు దళిత సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రిజర్వేషన్లు చంద్రబాబు తాత, తండ్రి సొత్తు కాదు

- మాజీ ఎంపీ హర్షకుమార్
- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

నెహ్రూనగర్: రిజర్వేషన్లు చంద్రబాబు తాత, తండ్రి సొత్తు కాదని, ఆయన జిల్లాల వారీగా వర్గీకరణ ఎలా చేస్తారో సమాధానం చెప్పాలని మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. బ్రాడీపేటలో సోమవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 'హలో మాల..చలో గుంటూరు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అంటరానితనం ఆధారంగా రిజర్వేషన్లు ఆనాడు కల్పించబడ్డాయని.. కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణపై నేడు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని విమర్శించారు. 341 ఆర్టికల్ సవరణ చేయకుండా రాష్ట్రాలు ఏవిధానంలో వర్గీకరణ చేస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. క్రిమిలేయర్ విధానంతో రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు చేస్తున్న వారి పిల్లలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. మాలలంతా ఏకమై ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మరో రాజకీయపార్టీ రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మాలలు చేసే పోరుకు స్పందించి కేంద్రంలోని బీజేపీ, సుప్రీంకోర్టు వర్గీకరణ అంశాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో చీరాల యువకుల సత్తా



చీరాల: బాడీ బిల్డింగ్ పోటీలలో చీరాల కుర్రోళ్లు సత్తా చాటారు. ఏలూరులో ఈనెల 15న జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో 55 కేజీల విభాగంలో చీరాల రూరల్ మండలం పాతచీరాలకు చెందిన సూరిన భాస్కర్‌రెడ్డి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 50 కేజీల విభాగంలో చీరాల రూరల్ మండలం పాత చీరాలకు చెందిన మేరుగు కిశోర్ నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తమ విజయానికి దోహదపడిన ఫిట్‌నెస్ జిమ్ ట్రైనర్ గుమ్మడి బూన్‌కు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్ ఫోన్ సర్వీసింగ్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 14నుంచి సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసెస్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సెల్‌ఫోన్ సర్వీసింగ్, టైలరింగ్‌ను యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. 10వ తరగతి పాస్/ ఫెయిల్ అయిన 19 నుంచి 45 సంవత్సరాలలోపు అర్హులని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఫొటోస్టాట్లతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు లేదా 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

చక్కని చేతిరాతతో ఉన్నత భవిష్యత్



ఉపాధ్యాయులతో రవీంద్రనాథ్‌రెడ్డి, ఉప్పాల రామమోహన్‌రావు, రిసోర్స్ పర్సన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాతను అందంగా మలచుకోవడం ద్వారా జీవితంలో ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఏర్పడిన క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి-పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో 103వ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ క్యాలిగ్రఫీ అనేది అద్భుతమైన కళ అన్నారు. చిన్నతనం నుంచే దాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా చదువుపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వస్తారని, తద్వారా అందమైన భవిష్యత్తు ఏర్పరుచుకోవచ్చని ఆయన సూచించారు. క్యాలిగ్రఫీ ఫ్యామిలీ నిరంతరం ఉచిత శిక్షణ కార్యక్రమాల్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. క్యాలిగ్రఫీ ఉద్యమాన్ని ప్రారంభించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహన్‌రావు మాట్లాడుతూ శిక్షణ శిబిరానికి కంకిపాడు, అవనిగడ్డ, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 30 మందికి పైగా ఉపాధ్యాయులు హాజరైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు నేర్పించేందుకు అవసరమైన మెటీరియల్ అందించినట్లు చెప్పారు. ఇప్పటి వరకూ 46వేల మందికి పైగా విద్యార్థులతో పాటు నాలుగు వేల మందికి పైగా ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్య శిక్షణ అందించినట్లు వివరించారు. శిక్షణలో రిసోర్స్ పర్సన్లుగా శారద, రమాదేవి, శైలజా రాణి, ప్రసాద్, అనిల్ కుమార్, సత్య నారాయణ, షాజీర్, బురాన్ వ్యవహరించారు.

సందడిగా ఎడ్ల బండ లాగుడు పోటీలు ప్రారంభం

తొలి రోజు పాల పళ్ల విభాగంలో నిర్వహణ



పోటీల్లో బండలాగుతున్న గిత్తలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారకరామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పశు బల ప్రదర్శన పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు పెమ్మసాని రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయానికి ప్రతీక ఎడ్ల ప్రదర్శన పోటీలని తెలిపారు. తొలి రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి పాల పళ్ల విభాగం పోటీలు ప్రారంభించారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పల్నాడు జిల్లాల నుంచి పద్నాలుగు జతల గిత్తలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో పమిడి అంజయ్య చౌదరి, కాకాని సురేష్‌బాబు, గోగినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

పాల పళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లెకు చెందిన కూతర్ల దక్షిత్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డి గిత్తలు 4,200 అడుగులు లాగి ప్రథమ స్థానాన్ని సాధించారు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకివీడు గ్రామానికి చెందిన బచ్చిగారి హరికృష్ణనాయుడు, విజయలక్ష్మి నాయుడు గిత్తలు 3,917 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కొండకావూరుకు చెందిన మర్రి వెంకటేష్ గిత్తలు 3,828 అడుగులు లాగి తృతీయ స్థానాన్ని, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కుంటకాడిపల్లె గ్రామానికి చెందిన దండూరి శ్రీరాములు గిత్తలు 3,748.5 అడుగులు లాగి నాల్గవ స్థానాన్ని దక్కించుకున్నాయి.